క్లుప్తంగా

నేడు బేడీ సంస్మరణ సభ

పెనుకొండ రూరల్: యంగ్ ఇండియా సంస్థ వ్యవస్థాపకుడు నరేంద్ర సింగ్ బేడీ సంస్మరణ సభ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న షాదీ మహల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా మాజీ ఉద్యోగులు తెలిపారు. యంగ్ ఇండియా సంస్థతో కలసి సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్న వారితో పాటు, మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని మాజీ ఉద్యోగులు వెంకటేశులు, డ్వాక్రా రామాంజినేయులు, కృష్ణమూర్తి, బలరాం కోరారు.

జీతాలు చెల్లించకపోతే సమ్మెలోకి వెళ్తాం


కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు

చిలమత్తూరు: శ్రీరామిరెడ్డి తాగునీటి పంప్ హౌస్‌లో పనిచేసే కార్మికులకు జీతాలు చెల్లించపోతే సమ్మెలోకి వెళ్లడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు తెలిపారు. బుధవారం హిందూపురం రూరల్ మండలం మనేసముద్రం గ్రామంలోని పంప్‌హౌస్ వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు మార్చి 3 లోపు జీతాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఆయన మాట మేరకు తాత్కాలికంగా సమ్మె విరమించినట్లు పేర్కొన్నారు. ఒకవేళ మాట నిలబెట్టుకోకపోతే సమ్మె ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


శస్త్ర చికిత్స శిబిరానికి ఎంపికైన రోగులతో వైద్యులు

పావగడ: స్థానిక హెల్ప్ సొసైటీ, సేవా ట్రస్ట్, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో తిరుమణి గ్రామంలోని పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన కంటి వైద్య చికిత్స శిబిరానికి స్పందన వచ్చింది. 200 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వారిలో 68 మంది కంటి రోగులు శస్త్ర చికిత్సకు ఎంపికయ్యారు. వారిని ప్రత్యేక వాహనంలో బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రికి తరలించారు. నిర్వాహకులు మానం శశికిరణ్, సంధ్యా శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి

పెనుకొండ: విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాట వేసుకోవాలని సత్యసాయి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ పేర్కొన్నారు. బుధవారం ఆ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థులకు వీడ్కోల సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే కష్టపడి చదివే గుణం అలవరుచుకోవాలన్నారు. ప్రణాళిక ప్రకారం ముందుకు వెళితే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువులను సన్మానించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆదిశేషారెడ్డి, ఏఓ కేశవయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు


రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి

అగళి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ మంజువాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ల్యాబ్, ఆరోగ్య కేంద్రం పరిసరాలు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రసవాలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల టీకాల వివరాలు, రికార్డులు పరిశీలించారు. అనంతరం రామాపురంలో ఫ్యామిలీ ప్రోగ్రామ్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివనంద, గాయత్రి , పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, సూపర్ వైజర్ నర్సారెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉలవ పంటకు నిప్పు

గోరంట్ల: మండల పరిధిలోని రామన్నపల్లికి చెందిన రైతు నారాయణప్ప 9 ఎకరాల్లో సాగు చేసిన ఉలవ పంటకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. పంట మొత్తం అగ్నికి ఆహుతి కావడంతో రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు నారాయణప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

దోచెయ్ !


పట్టణంలోకి వెళ్తున్న మట్టిలోడ్ టిప్పర్

- పెనుకొండ పరిసరాల్లోని కొండ, గుట్టలను కరిగిస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులు


తిమ్మాపురం సమీపంలో ఓ ప్రైవేట్ భూమిలో చదును కోసం చేర్చిన మట్టి


పెనుకొండలోని కొండ ప్రాంతంలో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్: పెనుకొండ ప్రాంతంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. సహజ సంపదను కొల్లగొడుతూ జేబులు నింపుకుంటున్నారు. ఇటీవలి కాలంలో కియా పరిశ్రమ పరిసర ప్రాంతంలో వేర్‌హౌస్‌లు, హోటళ్ల నిర్మాణాలు అధికమయ్యాయి. చదును ప్రక్రియకు ఎర్రమట్టి ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో వాటి నిర్వాహకులు స్థానికులపైనే ఆధారపడాల్సి వస్తోంది. దీన్నే అదనుగా భావించిన కొందరు కూటమి నాయకులు అక్రమాలకు తెరతీశారు. గొందిపల్లి, కురుబవాండ్లపల్లి ప్రాంతాల్లో ఉన్న కొండ, గుట్టలను కొల్లగొడుతున్నారు. జేసీబీ, టిప్పర్ల ద్వారా ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తు లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో టిప్పర్‌పై రూ. 5 వేలకు పైగా వసూలు చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.

పట్టించుకోని అధికారులు

పెనుకొండ పరిధిలో ఉన్న 44వ జాతీయ రహదారి పైనే రెవెన్యూ, విజిలెన్స్ అధికారులు వెళ్తుంటారు. వారి ఎదుటనే టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలివెళ్తున్నా పట్టించుకోవడం లేదు. కొండలు, గుట్టలు కూడా కరిగిపోతున్నా ఏమీ పట్టనట్లు వ్యవహరించడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సహజ సంపదను కాపాడాలి



నిబంధనలు ఉల్లంఘించి సహజ వనరులైన కొండ ప్రాంతాల్లో మట్టిని తరలించడం సరికాదు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం సంపదను తరలిస్తే మానవాళికి ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలి. అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలి.

– రమేష్ , సీఐటియూ జిల్లా కార్యదర్శి

మట్టి తరలిస్తే చర్యలు తప్పవు



సహజ సంపదను కాపాడేందుకు మా వంతు ప్రయత్నిస్తాం. పెనుకొండ ప్రాంతంలో ఉన్న కొండ, గుట్ట ప్రాంతాల్లో మట్టి తరలించేందుకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా ఆయా ప్రాంతాల్లో కొండ, గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, తహసీల్దార్, పెనుకొండ

భాషాభివృద్ధిపై అవగాహన

అమరాపురం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా రెండోరోజు భాషాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్పీ యువరాజు... అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, జ్యోతి, అనసూయ, కావ్య, నాగమణి, భారతి తదితరులు తెలుగు భాష, ఆంగ్ల భాషలను ఏవిధంగా నేర్చుకోవాలి, వాటిని పిల్లలకు ఏ విధంగా నేర్పించాలని వివరించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర: మండలంలోని అంగనవాడీ కార్యకర్తలకు బుధవారం పట్టణంలోని ఉపాధ్యాయ భవన్‌లో జ్ఞానజ్యోతి కార్యక్రమంపై శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో స్థానిక సీఐ రాజ్‌కుమార్ పాల్గొన్నారు. ఎంఈఓలు శ్రీనివాస్, భాస్కర్, నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ శిక్షణ తరగతులు జరిగాయి. అంగనవాడీ కేంద్రాల్లోని 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అంగనవాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ట్రైనర్లు శివప్రసాద్, మధు, సూపర్ వైజర్ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.


అమరాపురం: భాషాభివృద్ధిపై మాట్లాడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రొళ్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రెండోరోజు అంగనవాడీ వర్కర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్లు మాట్లాడుతూ ప్రాథమిక విద్యాభ్యాసం కోసం క్రమం తప్పకుండా అంగనవాడీ కేంద్రాలకు చిన్నారులు హాజరయ్యే విధంగా తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సన్నమ్మ, అంగనవాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మడకశిర మున్సిపల్ బడ్జెట్

మడకశిర: మడకశిర మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసమ్మ అధ్యక్షత వహించారు. సమావేశంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో మున్సిపల్ బడ్జెట్‌ను రూ.8,25,36,607 ప్రతిపాదించగా.. ఈ సారి ఆ మొత్తాన్ని రూ.9,10,88,818కు ప్రతిపాదించారు. అనంతరం మున్సిపల్ బడ్జెట్‌పై సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ మాట్లాడుతూ ఈ బడ్జెట్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ఈ నిధులతో మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజల సమస్యలను పరిష్కారమే ధ్యేయంగా బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు కూడా చేపడతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.


మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లు

పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచండి

పెనుకొండ రూరల్: నగర పంచాయతీలో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న కార్మికుల సంఖ్యను పెంచాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెనుకొండ మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీగా ఏర్పడినప్పటికీ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సంఖ్య పెరగలేదన్నారు. తక్కువ మంది కార్మికులు ఉండటంతో ఉన్న వారిపై పని భారం పెరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి 250 కుటుంబాలకు నలుగురు కార్మికులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, బాబావలి, వెంకటేష్ , ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రభుత్వానికి రైతుల కష్టాలు కనిపించవా?

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ విఫలమవుతోంది. అసలు రైతుల కష్టాలు ఈ ప్రభుత్వానికి కనిపిస్తున్నాయా? అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో ప్రశ్నించారు. కష్టపడి పండించిన మిర్చికి మద్దతు ధర లేక తీవ్రంగా నష్టపోతున్న రైతులకు అండగా నిలవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు వెళితే కనీసం కూటమి ప్రభుత్వం భద్రత కల్పించలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు కష్టాలు పడకుండా అన్ని విధాలుగా అండగా నిలిచి రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చంద్రబాబు ఏనాడూ పూర్తిస్థాయిలో అమలు చేసిన చరిత్ర లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం అమలు చేసేలా వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు.

రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

మడకశిర: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే సబ్సిడీ రుణాలకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వివిధ వర్గాలకు చెందిన 113 మంది అభ్యర్థులు ఈ ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. కమిషనర్ రంగస్వామి, బ్యాంక్ మేనేజర్లు, ఏఈ మురళి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

పరిగి: సబ్సిడీ రుణాల ఎంపికకు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 252 మంది హాజరయ్యారు. కెనరా బ్యాంకు మేనేజర్లు మహదేవ, ఆలీబాబా, ఎస్‌బీఐ మేనేజర్లు శివశంకర్, చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్వర్థప్ప పాల్గొన్నారు.


పరిగి: ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ శ్రీధర్

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సబ్సిడీ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. 54 యూనిట్ల కోసం 174 మంది హాజరైనట్లు ఎంపీడీఓ నరసింహమూర్తి పేర్కొన్నారు.

పాఠశాలల్లో జాతీయ హిందీ దివస్

అగళి: మండలంలోని ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ హిందీ దివస్ నిర్వహించారు. బుధవారం ఆదర్శ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవం సందర్భంగా ఎంఈఓ–2 చంద్రశేఖర్‌నాయుడు విద్యార్థులకు భాషా ప్రాముఖ్యత, నైపుణ్యత, గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాఫర్, ప్రధానోపాధ్యాయుడు వరదరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తికి తీవ్ర గాయాలు

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామ సమీపంలో బుధవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కదిరేపల్లికి చెందిన మహేష్‌కు కాలుకు తీవ్ర రక్త గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. కర్ణాటక రాష్ట్రం శిర నుంచి స్వగ్రామం కదిరేపల్లికి వెళ్తుండగా ఆలూడి వద్ద రోడ్డు మలుపు వద్ద వాహనం అదుపుకాక పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను స్థానికులు 108 ద్వారా రొళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు కుటుంబీకులు తెలిపారు.

హేమావతికి రూ.లక్ష ఆదాయం

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామ సచివాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ పరిధిలోని చింత ఫలసాయం, సిద్దేశ్వర స్వామి జాతరకు వచ్చే వాహనాల పార్కింగ్ నిర్వహణ కోసం సర్పంచ్ తిప్పేస్వామి అధ్యక్షతన, కార్యదర్శి నరేష్ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్ కోసం తిప్పజ్జ రూ.76,000 వేలకు పాటపాడి దక్కించుకున్నారు. అలాగే చింత ఫలసాయాన్ని నరసింహరాజు రూ.27,000కు పాట పాడి దక్కించుకున్నారు. ఈ మొత్తం రూ.లక్షా మూడు వేలు పంచాయతీకి ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు.

మండల కార్యదర్శిగా రంగప్ప

సోమందేపల్లి: సీపీఎం మండల కార్యదర్శిగా వడ్డె రంగప్ప ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పెద్దన్న తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని పేర్కొన్నారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

హిందూపురం అర్బన్: వ్యాపారులు తూనికలు, కొలతల్లో అవకతవకలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టపర చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల రాయలసీమ రీజియన్ జాయింట్ కంట్రోలర్ గోపీకృష్ణారెడ్డి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం హిందూపురం తూనికలు, కొలతల కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అమ్మకం ధరలను తప్పని సరిగా ప్యాకెట్‌పై ముద్రించాలన్నారు. అలా ముద్రించకుండా అమ్మిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

మహాసభ పోస్టర్ల విడుదల


పోస్టర్లు విడుదల చేస్తున్న ఉద్యోగ సంఘం నాయకులు

పెనుకొండ రూరల్: ధర్మవరం పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలోని సీఎస్‌బీ గార్డెన్‌లో మార్చి 2న నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రథమ కౌన్సిల్ మహాసభను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీధర్ చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఉద్యోగ సంఘం నాయకులు అబ్దుల్‌ఖాదర్, బషీర్, సాధిక్, జగన్నాథ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అందరి సహకారంతో చోరీలకు చెక్


హౌసింగ్ బోర్డ్ కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ జనార్దన్

హిందూపురం అర్బన్: అందరి సహకారంతో చోరీలకు చెక్ పెట్టొచ్చని టూటౌన్ ఇన్‌చార్జ్ సీఐ జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం హౌసింగ్ బోర్డ్ కాలనీ, టీచర్స్ కాలనీల్లో ప్రజలతో సమావేశమై అవగాహన కల్పించారు. ఇళ్ల వద్ద, దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు మీ ప్రాంతంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

శుభకార్యం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని కురుబరపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరనాగప్ప కుమార్తె అమూల్య వివాహ వేడుక జంగమరపల్లి వీరనాగమ్మ దేవాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయర్త ఈరలక్కప్ప, నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు చంద్రశేఖర్, శంకరప్ప, శీనానాయక్, గోపాలప్ప, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మడకశిర: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు బుధవారం పట్టణంలో పర్యటించారు. వైఎస్సార్ సర్కిల్‌లోని ఒడిశలమ్మ ఆలయం వద్ద ప్రజలతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

హంద్రీ-నీవా కాలువ సామర్థ్యం పెంచండి

పెనుకొండ: హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచాలని, నీటిని స్థిరీకరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయకట్టుకు నీరిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పుడు మాట మారుస్తున్నారన్నారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ వెడల్పు చేసి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సూచించారు. హంద్రీనీవాకు సంబంధించి కాంక్రీట్ లైనింగ్ చేపట్టి రైతులను నష్టాలకు గురిచేస్తే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలకు సిద్ధమవుతామన్నారు. బనకచెర్ల వరకూ కాలువ తవ్వి గోదావరి నీళ్లు ఇస్తామంటున్న ముఖ్యమంత్రి హంద్రీనీవా కాలువ విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. హంద్రీనీవా ఆధునీకీకరణ పనులు చేపట్టి రిజర్వాయర్లతో పాటు అన్ని చెరువులను నీటితో నింపాలన్నారు.

ఆమరణ దీక్ష భగ్నం


దీక్షా శిబిరంలో శ్రీనివాసబాబు

పావగడ: అత్యంత వెనుకబడిన పావగడ తాలూకా సమగ్రాభివృద్ధికి ఆర్టికల్ 371జే ప్రకారం ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సమాజ సేవకుడు శ్రీనివాసబాబు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను స్థానిక పోలీసులు బుధవారం భగ్నం చేశారు. ప్రభుత్వ వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఆయనను తుమకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బకాయిలు చెల్లించాలని వినతి

సోమందేపల్లి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కూలీలతో కలిసి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్రకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, వెంకటేశులు, హనుమయ్య, నాగభూషణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

అమరాపురం: స్థానిక వినాయకనగర్‌లో ఛత్రపతి శివాజీ జయంతిని వినాయక కమిటీ సభ్యులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ చిత్ర పటానికి పూలమాలలు నివాళులర్పించారు. హిందూ సోదరులను సంఘటిత పరచడంతో శివాజీ కృషి ఎనలేనిదన్నారు. అలాగే నాయకత్వ లక్షణాలు, దూరదృష్టి, రాజకీయ, ఉన్నత విలువలు కలిగిన వ్యక్తి శివాజీ అని కొనియాడారు. హిందువుల ఐక్యత కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో హనుమంతరాజు, మాలు, శంకర్, తిప్పేస్వామి, హరీష్, యోగిష్, నితిన్, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల ఛత్రపతి శివాజీ యువసేన ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నాయకుడు బంగారు చంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత కొడిగెనహళ్లి, సేవామందిరంలోని పుర వీధుల గుండా శివాజీ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సేవా మందిరం కూడలిలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ భారీ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. అనంతరం కూడలిలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ యువసేన సభ్యులు, బీజేపీ నాయకులు వెంకటరెడ్డి, సంగారెడ్డి, సంజీవమూర్తి, బాబుప్రసాద్, గొర్రెపల్లి చంద్ర తదితరులు పాల్గొన్నారు.


పరిగి: ఛత్రపతి శివాజీ ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న ఛత్రపతి శివాజీ యువసేన నాయకులు


అమరాపురంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం